మంచి ఆరోగ్యానికి ఆహార అలవాట్లే ప్రధానం

వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మంచి ఆరోగ్యానికి ఆహార అలవాట్లే ప్రధానమని, ప్రస్తుత యాంత్రీకరణ జీవనంలో ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. మంగళవారం రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చిలో ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహార అలవాట్లు, ప్రతి రోజూ వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ వైద్య సంస్థలు సామాజిక బాధ్యతతో పేదలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యులు 400 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ప్రేయర్ పవర్ చర్చెస్ డైరెక్టర్ శ్యామ్ అబ్రహం, కన్వీనర్ సుబ్రహ్మణ్యం, బీఆర్ఎస్ యువజన కమిటీ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, సీనియర్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌చారి, కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ నఫీ, జర్నల్ ఫిజిషియన్ డాక్టర్ మొయినుద్దీన్, ప్రపముఖ పుల్ మొనాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ అలీమ్, గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి, ఆర్థోపెటిక్ సర్జన్ డాక్టర్ ఆనంద్‌బాబు, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వరణ్, కేర్ ఆసుపత్రి మీడియా ఇన్‌చార్జీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల, మతాలకు అతీతంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి సూచించారు. మంగళవారం బాగ్ లింగంపల్లిలోని ఎల్ఐజీ క్వార్టర్స్‌లోని రేణుక ఎల్లమ్మ టెంపుల్‌ను సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్‌ను సత్కరించారు. అనంతరం రవిచారి మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండుగ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందని. ప్రపంచ దేశాల్లోని తెలుగు వారు ఈ ఉత్సవాలను నిర్వహించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.


ఎల్ఐజీలోని రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ రవిచారి

వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలి


ప్రభుత్వ ముఖ్య సలహాదారులు వేణుగోపాల్ రావును కలిసిన డాక్టర్ వైద్యనాథ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీవో నెంబర్ 317 ప్రకారంగా వ్యవసాయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైద్యనాథ్ కోరారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారులు హర్కర వేణుగోపాలరావును కలసి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్లు, ముఖ్యంగా వ్యవసాయ అధికారులకు వాహన సౌకర్యాలు, హెల్త్ కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. వేణుగోపాల్‌రావును కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షులు శశిధర్ రెడ్డి తదితరులున్నారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకులాల్లో సీటు ఇవ్వాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


బుర్ర వెంకటేశంకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, వేముల రామకృష్ణ

కాచిగూడ: దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి గురుకులాల్లో సీటు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్.కృష్ణయ్యతో కూడిన ప్రతినిధి బృందం మంగళవారం ప్రిన్సిపాల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచి, అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. గురుకులాల్లో వర్కర్ల, టీచర్ల సంఖ్యను పెంచి, పదో తరగతి విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందించాలని డిమాండ్ చేశారు.గురుకులాలకు సొంత భవనాలతో పాటు డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు గ్లీజర్లు, పడక మంచాలు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యార్థుల పర్యవేక్షణ కోసం ప్రత్యేకమైన కేర్ టేకర్ (వార్డెన్స్)లను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మల్లేష్ యాదవ్, చంద్ర కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని కేటగిరీల టీచర్ పోస్టులను భర్తీచేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం


కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: రాష్ట్రంలో డీఎస్సీని 3 నెలలు వాయిదా వేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొత్తం అన్నీ కేటగిరీల పోస్టులను భర్తీ చేసి పాఠశాల విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని అన్నారు. రాష్ట్రంలో పాఠశాలల్లో ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలకు అనుగుణంగా డీఎస్సీ కింద 25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిందేనని అన్నారు. లక్షల మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తూ ఫ్రిపేర్ అవుతున్నారని ఆయన పేర్కొన్నారు. 2,200 మాత్రమే ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలని, పదోన్నతుల ద్వారా భర్తీని 75 శాతం కాకుండా 25 శాతానికి తగ్గించి మిగతా పోస్టులను డైరెక్ట రిక్రూట్‌మెంట్ కోటా కింద భర్తీ చేయాలని అన్నారు. ప్రస్తుతం 11వేల టీచర్ పోస్టుల భర్తీకే ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు పీఆర్సీ కమిటీ నివేదికలో పేర్కొందని ఆ మేరకు డీఎస్సీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత 10 సంవత్సరాల కాలం నుంచి దాదాపు 6వేలకు పైగా పాఠశాలలు మూసి వేశారని, వీటిలో కూడా టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఇప్పుడు 22వేల స్పెషల్ టీచర్లు నియమించడానికి ఆర్థిక శాఖ 5నెలల క్రితం ఆమోదించిందని, టీచర్ పోస్టులు ఖాళీలేకపోతే ఈ స్పెషల్ టీచర్లను ఎందుకు నియమిస్తారని ఆయన ప్రశ్నించారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 16వేల పాఠశాలలో ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరని ఆయన పేర్కొన్నారు. మెడిసిన్, నీట్ తదితర పోటీ పరీక్షలలో ఇతర రాష్ట్రాలతో మన విద్యార్థులు పోటీ పడలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నీలం వెంకటేష్, నందగోపాల్, సురేష్, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోల్లోనే చెత్తను వేయాలి

నల్లకుంట: ఇళ్లల్లో పేరుకు పోయిన వ్యర్థాలను వీధుల్లో పారవేయకుండా ఇంటింటికి చెత్త సేకరణకు వచ్చే జీహెచ్ఎంసీ స్వచ్ఛ వాహనాల్లోనే వేయాలని జీహెచ్ఎంసీ సర్కిల్–16 డీసీ మారుతి తిరుమల్ ప్రజలకు సూచించారు. జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీ, నర్సింహబస్తీ వీధుల్లో చెత్త కుప్పల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా వీధుల్లోని పేరుకు పోయిన చెత్త కుప్పలను తొలగింపచేసి అక్కడ ముగ్గులు వేయించి అక్కడ క్యారం బోర్డు ఆడించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ వీధుల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేసే వారిని గుర్తించి అలాంటి వారిపై రూ. 1000 ఫైన్ వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్. నర్సింగ్ రావు, ఎస్.మహేష్ కుమార్, కె. లక్ష్మణ్ కుమార్, ఏఎంఓహెచ్, జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.


చెత్త కుప్పలను తొలగింపజేసి క్యారం బోర్డు ఆడుతున్న జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది

చినుకు.. వణుకు

- మారిన వాతావరణం కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు

పరిశుభ్రత ప్రాణానికి రక్ష అని అధికారుల హెచ్చరిక


ఓపీ చీటీల కోసం ఫీవర్ ఓపీ వద్ద క్యూ లైన్‌లో వేచి ఉన్న రోగులు

నల్లకుంట: నగరంలో గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అక్కడక్కడ సీజనల్ వ్యాధుల ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో బస్తీలు, కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జాగ్రత్తలు పాటించకుంటే రోగాల బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్యం క్షీణించి దోమలు వృద్ధి చెంది విషజ్వరాలతోపాటు డెంగీ, మలేరియా, అతిసారం, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ఎవరికి వారే స్వీయ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు పాటించాలని చెబుతున్నారు. అయితే మారిన వాతావరణ పరిస్థితుల సీజనల్ వ్యాధులతోపాటు జ్వరాలు రావడంతో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి చికిత్సల కోసం వస్తున్న జ్వరపీడుతుల బారులుతీరుతున్నారు.

ఇలా ప్రబలుతాయి..

డెంగీ..

పగలు కుట్టే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటుతో ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన జ్వరం, నొసటి తలనొప్పి, కంటి లోపల కదలికలు తగ్గడం, కండరాల్లు, కీళ్ల నొప్పులు, వాంతి అవుతున్నట్లు ఉండటం నోరు ఎండిపోవడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా..

ఎనాఫిలిస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా సోకుతుంది. ఈ వ్యాధి సోకితే చలి జ్వరం, విపరీతమైన తల నొప్పి తదితర లక్షణాలుంటాయి.

చికున్ గున్యా..

ఎడిస్ దోమ ద్వారా ఈ వ్యాది ప్రబలుతుంది. అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తల నొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

పైలేరియా..

మురుగు నీటిలో పెరిగే క్యూలెక్స్ దోమ కాటుతో పైలేరియా వ్యాధి ప్రబలుతుంది. మురుగునీటిలో దోమ లార్వాలు వృద్ధి చెందకుండా కిరోసిన్ చల్లి దోమల లార్వాలు నాశనం చేయాలి.

నివారణకు చర్యలు..

ఇంటి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీటి తొట్టెలు, కొబ్బరి బోండాలు, టైర్లు మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ప్రతి శుక్రవారం ఇంటి పరిర ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసి డ్రై డేగా పాటించాలి.దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. కూలర్లు, ఫ్రిజ్‌లు, బయట పడేసిన కొబ్బరి చిప్పలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలి.

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి



వాతావరణంలో మార్పులు రావడంతో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల కేసులు పెరుగుతున్నాయి. వ్యాధుల బారిన పడకుండా కాచి వడబోసిన నీటిని తాగాలి. కలుషిత, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను భుజించరాదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. స్నానానికి కలుషిత నీరు వాడరాదు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. జ్వరం వస్తే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి.

– ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపండి

ముషీరాబాద్: ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులను ఆపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసినట్లు రూరల్ మెడికల్ ప్రాక్టిషనల్, ప్రైవేటు మెడికల్ ప్రాక్టిషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నేతి రాజేశ్వర్‌రావు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధి బృందం జూన్ 13వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తెలంగాణ మెడికల్ కౌన్సిల్, ఇండియన్ కౌన్సిల్ అసోసియేషన్, డ్రగ్ డిపార్ట్‌మెంట్, పోలీసు డిపార్ట్‌మెంట్ అధికారులు ఆర్ఎంపీ, పీఎంపీలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ దాడులు నిర్వహిస్తున్నారని ఈ దాడులను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారన్నారు. ఈ మేరకు జులై 8వ తేదీన ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి దాడులను ఆపాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారని నేతి రాజేశ్వర్‌రావు తెలిపారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ సింగాడికుంట ఎల్లమ్మ, నాగదేవత ఆలయంలో ఎల్లమ్మ తల్లి కల్యాణం భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే సింగాడి కుంటా బస్తీలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఎల్లమ్మ కల్యాణాన్ని తిలకించడానికి చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహా, బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, బిఆర్ఎస్ నగర నాయకులు వల్లాల శ్రీనివాస్ యాదవ్, ముఖుందా రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్ బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బడే శ్రీనివాస్, సింగాడికుంట బస్తీ అధ్యక్షుడు బి. రాము, బస్తీ కమిటీ నాయకులు పాల్గొన్నారు. ఎల్లమ్మ కల్యాణం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి పొన్నంకు వినతి

కవాడిగూడ: నగరంలోని దోభీఘాట్‌లలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రజక దోభీ అభివృద్ధి సంస్థ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ ఎం. నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి చుక్కన్న, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజక కాలనీలు దోభీఘాట్‌లలో కరెంటు బిల్లులు కట్టడం లేదని విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని అధికారులు బెదిరిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు. నగరంలో ఉన్న 63 దోభీఘాట్‌లు ఉండగా 26 దోభీ ఘాట్‌లలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రజకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉప్పల్‌లో నిర్మిస్తున్న చాకలి ఐలమ్మ భవన్‌ను త్వరితగతిన నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. దీనికి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ సమస్యపై విచారించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక దోభీ అభివృద్ధి సంస్థ గ్రేటర్ ప్రధాన కార్యదర్శులు బి. చంద్రమోహన్, కిషన్, సుధాకర్, నాయకులు ఏ అశోక్, సి. అశోక్, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి కాచిగూడ నుంచి కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఏ ఊరుకెళ్తే ఆ ఊరిలో... దేవుళ్ల మీద ఒట్టుపెట్టి కాలం వెళ్లదీసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసే ఆలోచన మాత్రం చేయడం లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. హామీల అమలులో మోసం చేసే ప్రభుత్వాలకు తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లావణ్య, వరలక్ష్మీ, శాంతాబాయి, తారా పాల్గొన్నారు.


ధర్నాకు ర్యాలీగా తరలివెళ్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో డ్రైవర్స్ వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు బిఎన్ఎస్–2023 హిట్ అండ్ రన్ సెక్షన్ 106 (1) రద్దు చేయాలని సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో రవాణా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోర్టర్ వంటి ఆన్‌లైన్ యాప్‌లను ప్రభుత్వం నియంత్రించాలని, కమీషన్ ఐదు శాతం దాటకుండా చూడాలన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో డ్రైవర్లను వేధించడం సరైంది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని ఆదాయ వనరుగా చూడడం సరైంది కాదన్నారు. వెంటనే ప్రభుత్వం రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ నగర కార్యదర్శి కె.అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, సిఐటియూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, కె.సతీష్, కొండా గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మ్యారేజ్‌బ్యూరోలకు సర్టిఫికెట్ల అందజేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మ్యారేజ్ బ్యూరోలు నిర్వహిస్తున్న వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా పలు మ్యారేజ్ బ్యూరో సంస్థలకు సర్టిఫికెట్‌లు, గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మ్యారేజ్‌బ్యూరో నిర్వహించే వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడం వల్ల వివాహ యోగ్యులు ఎలాంటి మోసాలకు గురికారని అన్నారు. అంతేకాకుండా మ్యారేజ్ బ్యూరో వారికి భద్రత కల్పించడంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గడ్డమీది హరినాథ్‌గౌడ్, గౌడ హాస్టల్ అధ్యక్షులు చక్రపాణిగౌడ్, దర్గ చిన్నగౌడ్, కోశాధికారి మెరుగు కృష్ణవేణి, కొంపల్లి శంకర్‌గౌడ్, పులి సంతోష్‌గౌడ్, గారాల కళావతి, మంజులరాణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గౌడ మ్యారేజ్‌బ్యూరోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

నివారణపై అవగాహన

కాచిగూడ: దోమల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత అన్నారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. పిచ్చి మొక్కలు ఎక్కువ ఉంటే దోమల సంతాన ఉత్పత్తి కేంద్రాలుగా మారతాయని, వీటికి బదులు ఇళ్లలో తులసి, పూదీన, సిట్రోనెల్లాగ్రాస్, లెమన్ గ్రాస్ వంటి మొక్కలను కుండీల్లో పెంచుకోవడం వల్ల దోమలను చాలా వరకు నియంత్రించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సరుకులను అందజేస్తున్న మాతావాకర్స్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ సంఘం సమీపంలోని అనురాగ నిలయం వృద్ధాశ్రమానికి రూ. 70 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. బియ్యం, పప్పులు, వంట నూనెలు, గోదుమ పిండి, పసుపు, కారం తదితర వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు డాక్టర్ వై.మురళీధరుడు మాట్లాడుతూ 28 మంది వృద్ధులతో నడుస్తున్న ఈ ఆశ్రమాన్ని మానవతా దృక్పథంతో సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు డాక్టర్ నీలాశ్రీధర్, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మారం సురేష్‌బాబు, బి. శ్రీవణ్‌కుమార్, బ్రహ్మరాంబిక తదితరులు పాల్గొన్నారు.

21న గురు పౌర్ణమి వేడుకలు


బాబా మూల విరాట్.

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 21న గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సాయిబాబా సంస్థాన్ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటలకు నగర సంకీర్తనతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం బాబాకు కాకడ హారతి, మంగళ స్నానం, అర్చన, గణపతి పూజ, పుణ్యాహావాచనం, రక్షబంధనము, మండపారాధన, ఏకాదశ కలశ స్థాపనాపూర్వక అభిషేకం, సాయి గాయత్రి హోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనము ఉంటుందని చెప్పారు. 11 గంటలకు బాబాకు కలశాలతో అభిషేకం, అనంతరం మధ్యాహ్న హారతి, 12.30 గంటలకు నారాయణ సేవా (అన్నదానం) నిర్వహిస్తారని తెలిపారు. అలాగే సాయంత్రం 6.30 గంటలకు ధూప్ హారతి, 7 గంటలకు గురు సత్కారం (వేద పండితులకు), పల్లకీ సేవ, భజన, ఊయల సేవ ఉంటుందన్నారు. సేజ్ హారతితో వేడుకలు ముగుస్తాయని చెప్పారు. కలశ పూజలో పాల్గొనే భక్తులు పూజా సామగ్రి తెచ్చుకోవాలని సూచించారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని సంస్థాన్ కమిటీ సభ్యులు కోరారు.

సీఐ జితేందర్‌రెడ్డిని అరెస్టు చేయాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళిత ఎస్సై శ్రీరాములు శ్రీను ఆత్మహత్యకు కారకుడైన అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డిని అరెస్టు చేయడంతో పాటు అందు లో పనిచేస్తున్న నలుగురు కానిస్టేబుల్స్‌పై హత్యానేరం కేసును నమోదు చేయాలని డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డిబిఎఫ్, కేవీపీఎస్, ఎస్ఎన్ఏపీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ దళిత ఎస్సై ఆత్మహత్యకు కారకులైన సీఐ, కానిస్టేబుల్స్‌తో పాటు తప్పుడు వార్తలు రాసిన జర్నలిస్టులను కూడా అరెస్టు చేయాలని కోరారు. సిఐ వేధింపులు భరించలేకనే ఎస్సై ఆత్మహత్య చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. సీఐను సస్పెండ్ చేయకుండా కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన వారికే రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. మొత్తం సంఘటనపై సమగ్ర న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, వీసీకే రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, ఎన్‌పిపిఎఫ్ అధ్యక్షులు బత్తుల రాం ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు పులి కల్పన, వెంకన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు


రఘునాథ్‌నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం అంబర్‌పేట డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలసి ప్రజా సమస్యలపై పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లోని రఘునాథ్‌నగర్, ఓవైసీ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, కలుషిత, మంచినీటి సరఫరా, డ్రైనేజీలు, వీధీ దీపాలు వంటి సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ప్రజలు చేసిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని ఎమ్మెల్యే కాలేరు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు సిద్దార్ధ ముదిరాజ్, జాఫర్ లతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికుడికి గాయాలు

కాచిగూడ: రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికుడికి గాయాలైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.చంద్ర కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మౌలానా ఆజాద్‌నగర్ ప్రాంతానికి చెందిన జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికుడు సుదర్శన్ (55) నింబోలిఅడ్డ వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో అతని కుడి కాలు విరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.